దీవించవమ్మా.. మా తల్లీ వరలక్ష్మీ

- భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం
- అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



కలికిరి: లక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న ఎల్లమ్మ



మదనపల్లెలో నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరీ ఆలయంలో ధనలక్ష్మి అలంకారంలో అమ్మవారు



కలకడ: శ్రీకామాక్షిసమేత సిద్ధేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీపీ శ్రీదేవి, భక్తులు



కలికిరి: శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయంలో సామూహిక వరలక్ష్మీవ్రతానికి హాజరైన మహిళలు

మదనపల్లె సిటీ: వరలక్ష్మీవ్రతాన్ని భక్తులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇళ్లల్లో, ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరణ చేశారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారిని ధనలక్ష్మి అలంకారంలో అలంకరించారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలోని లలితా త్రిపుర సుందరిదేవిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు ఫణికుమార్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు. దేవతానగర్‌లోని రాజరాజేశ్వరి ఆలయంలో రాజరాజేశ్వరిని ప్రత్యేకంగా అలంకరించారు.

జ్ఞానాంబిక కాలేజీలో వరలక్ష్మీవ్రత పూజలు

స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్దనున్న జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీలో సామూహిక వరలక్ష్మీవ్రత పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు వరలక్ష్మీవ్రత విశిష్టతను తెలియజేశారు. కాలేజీ కరస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

పీలేరు : స్థానిక కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో, మండలంలోని అగ్రహారంలో వెలిసిన అష్టలక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీవ్రత పూజలు ఘనంగా జరిగాయి. మహిళా భక్తులు వరలక్ష్మీ వ్రతం చేపట్టారు. పీలేరు పట్టణంలోని శ్రీ సీతారామాలయం, శ్రీశ్రీశ్రీ రౌద్రాల అంకాలమ్మ ఆలయం, శ్రీ కన్యకాపరమేశ్వరి, కోటపల్లె శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, వెంకటాద్రి ఇళ్ల వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయం, మదనపల్లె మార్గంలోని చెన్నకేశవస్వామి ఆలయాల్లో వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించారు.

కలికిరి: వరలక్ష్మీవ్రతం పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామ దేవత ఎల్లమ్మ, శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి లక్ష్మీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయాలంలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీవ్రతం నిర్వహించారు.

వాల్మీకిపురం: స్థానిక కోనేటివీధిలోని శ్రీ లక్ష్మీ కామేశ్వర స్వామి ఆలయంలో ఉదయం అర్చన, అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీ అమ్మవారికి పూజలు నిర్వహించి, వరలక్ష్మీ వ్రత విశిష్టతను భక్తులకు వివరించారు. స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం, చింతపర్తిలోని వాసవీ అమ్మవారి దేవస్థానం, భగవాన్ శ్రీ సత్యసాయి సేవా మందిరం, తదితర ఆలయాల్లో వ్రత వేడుకలను వైభవంగా నిర్వహించారు. అర్చకులు గోనవరపు శీనాస్వామి, భక్తులు పాల్గొన్నారు.

ములకలచెరువు: మండలంలోని సోంపాళ్యం శ్రీకోట చౌడేశ్వరీదేవి అమ్మవారి ఆలయం, ములకలచెరువులోని శ్రీ కన్యకా పరమేశ్వరీదేవి అమ్మవారి ఆలయం, బురకాయలకోటలోని శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయాల్లో వరలక్ష్మీ వ్రత వేడుకలు జరిగాయి. మహిళలు పాల్గొని అమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.

రామసముద్రం మండలంలో శ్రావణ మొదటి శుక్రవారం వైభవంగా వరలక్ష్మీవ్రతం వేడుకలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరణ చేసి , పట్టువస్త్రాలు, బంగారం, ధనం, పలు రకాల పండ్లు, పిండి వంటలు సమర్పించారు. వేదపండితులు పూజ విధానం, వ్రతం గురించి వివరించారు. అష్టలక్ష్మీ స్వరూపం ప్రధానంగా 8 రూపాలలో భక్తులను అనుగ్రహిస్తుంది. ధనలక్ష్మీ, విద్యాలక్ష్మీ, సంతానలక్ష్మీ, వీరలక్ష్మీ, గజలక్ష్మీ, 8 రూపాలలో ఆవిర్భవించి మానవుల మనుగడకు కావలసిన ముఖ్యమైన సంపదల కోసం వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించిన వారికి లక్ష్మీకటాక్షం లభిస్తుందని తెలిపారు.

కలకడ : వరలక్ష్మీవ్రతం సందర్భంగా మండలంలోని ఆలయాల్లో, ఇంటిలో తమకు ఉన్న ఆభరణాలను అమ్మవారికి అలంకరించి శక్తి కొద్ది అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. మండలలోని అన్ని గ్రామాలలో నాగుల చవితి, వరలక్ష్మీవ్రతం పండగను జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో కులమతాలకు అతీతంగా అందరూ పాల్గొన్నారు.

సంక్షేమ రారాజు సీఎం జగనన్న



కాట్నగల్లులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం: రాష్ట్ర వ్యాప్తంగా లెక్కకు మించి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ సంక్షేమ రారాజుగా జగనన్న ఖ్యాతి గడించారని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని కాట్నగల్లులో సమరసత సేవా ఫౌండేషన్ ద్వారా రూ.10 లక్షల నిధులతో నిర్మించిన రామాలయంను ప్రారంభించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అడుగడుగునా ఎమ్మెల్యేకు ప్రజలు హారతులు ఇస్తూ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన 3.50 లక్షలతో సిమెంటు రోడ్డు, నాడు నేడు ద్వారా రూ.17.74 లక్షలతో పూర్తయిన పనులు, రూ.6 లక్షలతో మురికి నీటి కాలువ, జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.3.39 లక్షలతో పూర్తయిన పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయ పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాబోవు ఎన్నికల్లో నిండు మనసుతో ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు మహమూద్,సుబ్బరాం, కొండా సిద్దార్థ, డ్రిప్ రమణ, సందీప్‌రెడ్డి, గణపతిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, లక్ష్మీకర్, నారాయణరెడ్డి, వెంకట్, కార్యం చంద్ర, చెట్ల వెంకట్, గిరీష్,ఉత్తన్న, దిలీప్, సురేంద్ర, కేశవ్, రహ్మతుల్లా, మెకానిక్ చంద్ర, మంజునాథ్‌రెడ్డి, ముళీ, శివారెడ్డి, ఎంపీడీవో గిరిధర్ రెడ్డితో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సేవలు సత్వరం అందించాలి

ఆర్డీఓ మురళి



కన్వర్షన్ భూమిని పరిశీలిస్తున్న ఆర్డీఓ మురళి

వాల్మీకిపురం: ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి రెవెన్యూ సేవలను ప్రజలకు అందించాలని మదనపల్లి ఆర్డీఓ మురళి అన్నారు. శుక్రవారం మండలంలోని మూరేవాండ్లపల్లిలో వ్యవసాయ భూమికి సంబంధించి కన్వర్షన్ చేసేందుకు సంబంధిత భూములను ఆర్డీఓ మురళి పరిశీలించారు. అనంతరం స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ప్రజలకు అందించే రెవెన్యూ సేవల్లో జాప్యం చేయెుద్దని, నిర్దేశించిన సమయానికి ప్రజలకు, రైతులకు సేవలు అందించాలని సూచించారు. తహశీల్దార్ ఫిరోజ్ ఖాన్, వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై శిక్షణ

– కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త ఎస్. మానస

సిద్దవటం : వాటర్ షెడ్ రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై శిక్షణ ఇచ్చినట్టు కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. మానస తెలిపారు. శుక్రవారం మండలంలోని జ్యోతి గ్రామంలో ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం వారు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడి, పసుపు, డ్రాగన్ ఫ్రూట్ పంటల్లో సమగ్ర పంటల యాజమాన్యం, నూతన వంగడాలు, చీడాపీడలు, తెగుళ్ల యాజమాన్యాలపై రైతులకు వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ విభాగం శాస్త్రవేత్త టి. స్వామి చైతన్య మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ వాతావరణ విభాగం, ఊటుకూరు, కడప కేంద్రం నుంచి ప్రతి మంగళవారం, శుక్రవారాల్లో జిల్లా రైతాంగానికి రాబోవు 5 రోజులకు వాతావరణ సమాచారం, వాతావరణ ఆధారిత సూచనలు అందించడం జరుగుతుందని, ఈ సూచనలను అనుసరించి రైతులు తమ పంటల్లో తగు జాగ్రతలను తీసుకోవాలన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ టి. మహేష్‌బాబు మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం అందించే విస్తరణ సేవలు, సమీకృత వ్యవసాయ పద్ధతుల ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో బద్వేల్ వాటర్ షెడ్ ప్రాజెక్టు అధికారి బి. వేణుగోపాల్ రెడ్డి, వాటర్ షెడ్ కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ప్రతి పల్లెను ప్రగతి పథంలో నడిపిస్తాం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కేవీపల్లె : ప్రతిపల్లెను ప్రగతి పథంలో నడిపిస్తామని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని ఎంపీపల్లె పంచాయతీలో గుండ్రేవారిపల్లె క్రాస్, అంగజాలవారిపల్లె, ఎగువమేకలవారిపల్లె, దిగువమేకలవారిపల్లె, కమ్మపేట, నడిగడ్డ, ఒంటిల్లు, చెరువుకింద హరిజనవాడ తదితర గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన వివరాలు చదివి వినిపించారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురు భూ సమస్యలు గుర్చి ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామానికి మౌలిక వసతులు కల్పించడానికి ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన గ్రామాలకు రోడ్లు, కాలువలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. చిన్న చిన్న సమస్యలతో ఏవైనా పథకాలు అందకుండా ఉంటే సరిచేసి పథకాలు అందించడానికి గ్రామ సచివాలయ సిబ్బంది కృషి చేయాలని సూచించారు. సీఎం ఆశయానికి అనుగుణంగా లబ్ధిదారులకు పారదర్శకంగా పథకాలు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, యూత్ కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి, జెడ్పీటీసీ గజ్జెల శృతి, సర్పంచ్ రత్నాకర్‌రెడ్డి, ఎంపీటీసీ ఈశ్వరయ్య, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, నాయకులు ధర్మారెడ్డి, రెడ్డెప్పరెడ్డి, వినేష్‌రెడ్డి, వారాధిరెడ్డి, ద్వారకనాథరెడ్డి, రాజారెడ్డి, కొండారెడ్డి, ధనుంజయరెడ్డి, దినేష్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సత్వర సేవలు అందిస్తాం

బాధ్యతలు చేపట్టిన కమిషనర్ మనోహర్



నరసింహప్రసాద్ నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న మనోహర్

బి.కొత్తకోట: నగర పంచాయతీ ప్రజలకు అందించే సేవల్లో ఎలాంటి జాప్యం లేకుండా సత్వర సేవలు అందిస్తామని నూతన కమిషనర్ పీఆర్.మనోహర్ అన్నారు. శుక్రవారం ఆయన గత కమిషనర్ నరసింహప్రసాద్ నుంచి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయ ఉద్యోగులు, సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. ప్రజలకు కార్యాలయం ద్వారా అందించే సేవల విషయంలో ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కమిషనర్ మనోహర్‌ను సింగిల్‌విండో చైర్మన్ అమరనాథ్, బిల్డింగ్ సొసైటీ చైర్మన్ బలరాంరెడ్డి సత్కరించారు. నగర పంచాయతీ ప్రత్యేక అధికారిగా చిత్తూరుజిల్లా పుంగనూరు కమీషనర్ నరసింహప్రసాద్ కొనసాగుతారు.

డీసీసీ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

సిద్దవటం : డీసీసీ బ్యాంకు సేవాలను తెలియజేసేలా వారానికి ఒక గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని ఏజీఎం నారాయణ రాజు, మేనేజర్ కవిత, నోడల్ అధికారిణి సుచిత్రలు తెలిపారు. మండలంలోని వెలుగుపల్లె గ్రామాన్ని శుక్రవారం బ్రాంచ్ సిబ్బంది, ప్రధాన కార్యాలయ అధికారులు సందర్శించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని రైతులు, ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌లు, రైతు మిత్ర గ్రూప్‌ల సభ్యుల ఇంటికి వెళ్లి వారి లోన్ సమాచారం తెలుసుకొని డీసీసీ బ్యాంకు ప్రత్యేకతలను, ముఖ్యంగా రైతు భాగస్వామ్యం గురించి వివరించారు. అలాగే ఇతర బ్యాంకుల వడ్డీ రేట్లు, ఫీజు వసూళ్ల గురించి తెలిపినట్టు చెప్పారు.

డీసీసీ బ్యాంకు జిల్లా అభివృద్ధి కోసం పాటు పడుతుందన్నారు. అంతేగాకుండా లోన్ తీసుకున్న ప్రతి ఒక్కరూ సక్రమంగా రుణాలు చెల్లిస్తే వారికి ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీలు తీసుకొనవచ్చునని వివరించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



సంక్షేమ లబ్ధిని తెలియజేస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, విప్ కొరముట్ల

పుల్లంపేట : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలో నుంచి పుట్టిన గడప గడపకు మన ప్రభుత్వానికి వస్తున్న ప్రజాస్పందన చూసిన ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడు గుండెల్లో గుబులు పుట్టిస్తోందని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండలంలోని రెడ్డిపల్లి, ఎగువరెడ్డిపల్లి, ఎస్టీకాలని, అనంతరంపల్లె గ్రామాలలో గడప గడపకు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. అభివృద్ధే లక్ష్యంగా ముందుగా సాగుతున్నారన్నారు. భారతదేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టని పథకాలను ప్రవేశపెట్టారని చెప్పారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను 95 శాతం పూర్తిచేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు 650 హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చకుండా కాలయాపన చేశారన్నారు. ప్రస్తుతం దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్‌తో కలిసి సంక్షేమాన్ని అడ్డుకుంటున్నారన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ ప్రజాదరణను చూసి ఓర్వలేక లోకేష్ తనకు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని ఈ విషయాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు పుష్కలంగా ఉన్నాయన్నారు. అవినీతి రహిత పాలన అందించడమే కాకుండా మీ అందరికి తోడు నీడగా నిలుస్తున్న మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి 2024 ఎన్నికల్లో మీరంతా మళ్లీ ఒకసారి ఆశీర్వదించాలని గడప గడపలో ప్రజలను కోరారు. గతంలో ఏదైనా ప్రభుత్వ పథకం లబ్ధి పొందాలంటే మొట్టమొదటిగా జన్మభూమి కమిటీలకు ముడుపులు ముట్టచెబితే గాని లబ్ధి చేకూరేది కాదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం వలంటీర్ల ద్వారా ప్రభుత్వ పథకాలు కులమతాలు, పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుస్తున్నారన్నారు. వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శమన్నారు. అలాగే రెడ్డిపల్లె గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో జరుగుతున్న నాడు - నేడు పనులను పరిశీలించారు.

క్లుప్తంగా

జవహర్ నవోదయ గడువు పెంపు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం చిత్తూరు రోడ్డులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 31 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు మరోసారి గడువు పెంచినట్లు ప్రిన్సిపాల్ గోవిందరావు తెలిపారు. అదే విధంగా సెప్టెంబర్ 1,2 తేదీల్లో దరఖాస్తుల్లో వివరాలు సవరించుకునేందుకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పీలేరు - చెన్నై బస్సు సర్వీసు ప్రారంభం



పీలేరు - చెన్నై బస్సును ప్రారంభిస్తున్న డీఎం కుమార్

పీలేరురూరల్ : పీలేరు – చెన్నై బస్సు సర్వీసును శుక్రవారం స్థానిక డిపో వద్ద పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం కుమార్ మాట్లాడుతూ పీలేరు ప్రజలు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల సౌకర్యార్థం పీలేరు నుంచి చెన్నైకి బస్సు నడుపుతున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 6 గంటలకు పీలేరు నుంచి బయలుదేరుతుందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే స్థానిక గ్యారేజీలో అభినందన సభ నిర్వహించారు. జూలైలో అత్యధిక ఈపీకే సాధించిన కె. మహేంద్ర, కండెక్టర్ కె.దామోదర్ నగదు అవార్డు అందజేశారు. ఇంధనం పొదుపు సాధించిన డ్రైవర్లు బి.ఆర్.ఎస్. నాయక్, రాజేంద్రలకు నగదు అవార్డు అందజేశారు. సీఐ సుబ్బమ్మ, గ్యారేజీ ఎంఎఫ్ హరినాథరెడ్డి, స్టేషన్ మేనేజర్ బాబునాయక్ ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

మట్టి సేకరణ

పీలేరు: ఆజాదీకా అమృత్ మహోత్సవ్ భాగంగా ఢిల్లీలో కర్తవ్య పథ్ అమృతవాటిక స్థూపానికి మట్టి సేకరణ చేసినట్లు ఎంపీడీవో మురళీ మోహన్‌రెడ్డి నిర్వహించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో నా భూమి నాదేశం... నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల నుంచి మట్టి సేకరించామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు రామకృష్ణ, అయ్యప్ప, సూపరింటెండెంట్ సతీష్, నాయకులు బోదేషావలి, మయూర్‌నాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభను జయప్రదం చేయండి



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న విశ్వనాథ

పీలేరు : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథమాదిగ అన్నారు. శుక్రవారం ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా జరుగనున్న సభకు లక్షలాదిగా మాదిగలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కె.ఎస్. రాజు, ఉమ్మడిజిల్లా కన్వీనర్ దుద్దు రామకృష్ణ, నియోజవర్గ ఎంఎస్‌పీ ఇన్‌చార్జి గండికోట వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు గణేష్ లడ్డూ వేలం

పీలేరు : పీలేరు పట్టణంలో ఏటా అత్యంత వైభవంగా నిర్వహించనున్న గణేష్ ఉత్సవాల్లో భాగంగా ఈ ఏటా గణేష్ లడ్డు వేలం ఆదివారం నిర్వహించనున్నట్లు శ్రీ మహా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక ప్రియదర్శిని కళాశాలలో వేలం పాట జరుగుతుందని తెలిపారు. గణేష్ భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శిగా గిరినాథ రెడ్డి



కె.గిరినాథ రెడ్డి

కురబలకోట: వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శిగా మండలంలోని జంగావారిపల్లెకు చెందిన గిరినాథ రెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా కమిటీలో ఇద్దరికి చోటు



టి.విశ్వనాథ్

ములకలచెరువు: అన్నమయ్య జిల్లా వైఎస్సార్ సీపీ నూతన కమిటీలో ములకలచెరువు మండలానికి చెందిన ఇద్దరికి చోటు లభించింది. ములకలచెరువు మండలానికి చెందిన డి.రవీంద్రారెడ్డి, టి. విశ్వనాథ్‌లకు ఎక్స్‌క్యూటివ్ మెంబర్స్‌గా చోటు లభించింది. తమకు జిల్లా కమిటీలో అవకాశం కల్పించిన రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం



డ్రమ్ముల్లో నీటిని పరిశీలిస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం: ఫ్రైడే, డ్రైడే కార్యక్రమం సందర్భంగా శుక్రవారం మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు పీటీఎంలో పర్యటించి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, మురికి నీరు నిల్వ ఉంటే దోమలు ప్రబలి జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. డ్రమ్ముల్లో నీరు అధిక రోజులు నిల్వ ఉంచరాదని సూచించారు. ఆయన వెంట ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు ఉన్నారు.

శతాధిక వృద్ధుడికి పరామర్శ

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం కురవంకకు చెందిన శతాధిక వృద్ధుడు వెంకటరమణ(102)ను శుక్రవారం సీనియర్ సిటిజెన్స్ అసోసియేషియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.మునిగోపాలకృష్ణ పరామర్శించారు. వయోభారంతో మంచానికే పరిమితమైన వెంకటరమణ ఆరోగ్య పరిస్థితిని కుమారుడు శ్రీరాములను అడిగి తెలుసుకున్నారు. వెంకటరమణకు కావాల్సిన మందులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ మహిళా అధ్యక్షురాలు ధనలక్ష్మి ఉన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పీలేరురూరల్ : అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ గురుప్రసాద్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గాంధీరోడ్డుకు చెందిన టి. వెంకటరమణ 29 కర్ణాటక మద్యం టెట్రాపాకెట్స్ (90ఎంఎల్) తరలిస్తుండగా స్థానిక గాంధీ రోడ్డులో పట్టుకున్నారు. వాటిని స్వాధీనం చేసుకుని నిందితున్ని రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. ఎస్‌ఐ లక్ష్మీనరసయ్య, సిబ్బంది యోగానంద్, రాఘవయ్య, సుధాకర్, బాలకృష్ణ పాల్గొన్నారు.

నాగదేవత విగ్రహాల పునఃప్రతిష్ట



విగ్రహాల పునఃప్రతిష్టలో పాల్గొన్న మహిళలు

తంబళ్లపల్లె: మండలంలోని కన్నెమడుగు పంచాయతీ మరిమిరెడ్డిగారిపల్లెలో శుక్రవారం వైభవంగా నాగదేవత విగ్రహాల పునఃప్రతిష్ట జరిగింది. పురోహితులు కుమారస్వామి సాంప్రదాయబద్ధంగా నాగదేవత విగ్రహాలను పునఃప్రతిష్ఠించి ప్రాణప్రతిష్ట చేశారు. మహిళలు ఉపవాసంతో భక్తిశ్రద్ధలతో నాగదేవతలకు పూజలు చేశారు. టీచర్ గోపాల్‌రెడ్డి, స్వర్ణలత దంపతులు మహిళలకు పసుపు, కుంకుమ ,జాకెట్లు పంపిణీ చేశారు. అన్న సంతర్పణ చేశారు.

వైభవంగా వరలక్ష్మీవ్రతం .. మండలంలో మహిళలు శుక్రవారం రాత్రి వరలక్ష్మీవ్రతాన్ని భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుపుకున్నారు. మల్లయ్యకొండ గౌరమ్మగుట్టలో వెలసిన గౌరీమాతకు పూజారి పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

29న మెగా జాబ్ మేళా

మదనపల్లె సిటీ: తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో ఈనెల 29న జరిగే మెగా జాబ్ మేళాను విజయవంతం చేయాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి అన్నారు. శుక్రవారం కాలేజీలో విద్యార్థులతో జాబ్ మేళాపై సమావేశం నిర్వహించారు. కాలేజీ సర్వీస్ కమిషనర్ ఆదేశాల మేరకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జాబ్ మేళాలలో సుమారు 500 కంపెనీలు పాల్గొంటాయని, సుమారు 30 వేల ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. డిగ్రీ 2022–23, డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు జాబ్‌మేళాల్లో పాల్గొనవచ్చునన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లా నూతన కమిటీ ఎన్నిక

రాయచోటి అర్బన్ : ఏపీ గిరిజన సమాఖ్యకు జిల్లా నూతన కమిటీని శుక్రవారం ఎంపిక చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కే విశ్వనాథ నాయక్ అధ్యక్షతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ నూతన జిల్లా అధ్యక్షుడిగా రెడ్డిశేఖర్, ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు, కోశాధికారిగా గుండా శివలక్ష్మి, ఉపాధ్యక్షులుగా రవినాయక్, రాజారాం నాయక్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.